# ఉడ్ రోజ్

సాయంకాలం పూట బాల్కనీలో కూర్చుని వీధిలో వచ్చేపోయే వాళ్లని చూడటం అలవాటైంది నాకు. పనేముంది నాకు! అంతా కోడలే చూసుకుంటుంది. ఏదన్నా చేద్దామని వంటింట్లోకి వెళ్లబోతే, మీరేం చేస్తారు, వెళ్లి రెస్టు తీసుకోండి' అంటుంది.

విశ్రాంతి కావాలనుకున్నప్పుడు ఒక్క క్షణం తీరికలేకుండా దాకిరీతో సతమతమయ్యేదాన్ని. ఇప్పుడిక విశ్రాంతి-విశ్రాంతి. విశ్రాంతి అనుకుంటేనే విసుగుపుడుతోంది. వృద్ధాప్యం ఇంత విసుగనిపిస్తుందనుకోలేదు.

వాలు కుర్చీలో పడుకుని కునుకుతియ్యడం, మనవలందరితో ఆడుకోవడం, కథలూ, కబుర్లూ చెప్పడం, ఇరుగు పొరుగు వాళ్లతో, వచ్చేపోయే బంధువులతో ముచ్చట్లాడటం, ఇంట్లో వాళ్లని సాధిస్తూ కర్రపెత్తనం చేస్తూండటం—వృద్ధాప్యం ఎంతో హాయి అనుకునేదాన్ని చిన్నప్పుడు. ఇప్పుడు నా దాకా వచ్చాక తెలుస్తోంది. పల్లెటూళ్లలో, వృద్ధాప్యం గడపడానికీ, పట్నాల్లో వృద్ధాప్యం గడపడానికీ బోలెడు తేడా ఉందని కూడా తెలుస్తోంది.

ఈ మహానగరంలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు అంటీ ముట్టనట్లు ఉంటారు. ఇరుగు పొరుగు వాళ్లు చనువుగా మనింటికి రారు. మనం వెడితే ముళ్లమీద కూర్చున్నట్లు కూర్చుని వద్దు మొర్రో అంటున్నా గుక్కెడు కాఫీపోసి పంపిస్తారు అందుకే ఇలా బాల్కనీలో కూర్చుని వీధిలో వచ్చేపోయే వాళ్ళని చూడటమే నయం. చూస్తూ కూర్చుంటే ఏవో ఆలోచనలు పాతవీ, కొత్తవీ వచ్చి పోతూంటాయి. అదే కాలక్షేపం.

'ఏమిటి కమలా అది?' అన్నాను.

'ఓ పూలతీగ విత్తనం నాటుతున్నానండీ' అంది.

'ఏం పువ్వులు? శంఖం పూలతీగా? అని అడిగాను.

'కాదండీ, దీన్ని ఉడ్‌రోజ్ అంటారండి' అంది తలవంచుకుని మన్ను కెలుకుతూ.

నేనెప్పుడూ ఆ పేరు వినలేదు. వీళ్లు చామంతి పువ్వుల్ని కూడా ఇంగ్లీషు పేర్లతో పిలుస్తారు. అలాగే నాకుతెలిసిన పూలపేరేనేమో తెలుసుకుందామని, 'ఆ పువ్వులు చూడ్డానికెట్లా ఉంటాయమ్మా?' అన్నాను.

'పసుపుపచ్చని బాకా పువ్వులు పూస్తాయి ముందు. తరవాత వాటి తొడిమల్లోంచే గంధం చెక్క రంగులో గులాబీ పువ్వుల్లాంటివి పూస్తాయండీ' అంది.

'సువాసనేమైనా ఉంటుందా? లేకపోతే పూజకి పనికొచ్చేవా?' అని అడిగాను కుతూహలం ఆపుకోలేక.

'సువాసన ఉండదు కానీ, చాలా అందంగా ఉంటాయిఆ పువ్వులు. వాజ్‌లో పెట్టుకుంటే ఎన్నాళ్ళయినా నిలవుంటాయి' అంది.

ఏమో, ఏమిటో, నే నెప్పుడూ అలాంటి పువ్వుల్ని చూళ్ళేదు. శుభ్రంగా ఏ సన్నజాజి తీగో వేసుకుంటే ఘుమఘుమలాడుతూ బోలెడు పువ్వులు పూస్తాయి. తల్లో పెట్టుకోవచ్చు పిల్లలు. ఇంటికొచ్చిన ముత్తయిదువల కిచ్చుకుంటే ముచ్చటగా ఉంటుంది. అంతేగాని, కనీవివి ఎరుగని ఇలాంటి తీగలు తెచ్చి వేసుకోవడం ఎందుకో? పోనీ ఏ బూడిద గుమ్మడి కాయ తీగో వేసి డాబా మీద కెక్కిస్తే బోలెడు కాయలు కాస్తాయి. రెండు చేతులా నలుగురికీ పంచిపెట్టుకోవచ్చు. అలాఅనుకునే, ఆమధ్య గోడవారగా విత్తినాలు నాటాను. చక్కగా మొలిచాయి. ఆమర్నాడు చూస్తే మొక్కలు కనిపించలేదు. 'ఇక్కడ మొక్కలు ఏమయినా యర్రా?' అని అబ్బాయినీ కోడల్నీ ఇద్దర్నీ అడిగాను. మాకు తెలియదు పొమ్మన్నారు ఏ గడ్డి మొక్కలో అనుకుని వాళ్ళే పీకి పారేసి ఉంటారు, నా మాటంటే గడ్డి పరకంత విలువ లేకుండా పోతోందీ మధ్య.

'నాలుగు వంగ మొక్కలూ, బెండ మొక్కలూ పెంచండర్రా' అంటే, ఆ జాగాలో ముదనష్టపు బ్రహ్మజెవుడు మొక్కలూ, క్రోటను మొక్కలూ వేశారు. ఇద్దరి కిద్దరే. ఒకరి కొకరు తందాన తాన అనడం. అదైనా నేనెప్పుడైనా సలహా ఇచ్చినప్పుడే. ఉత్తప్పుడు అయిందానికీ కాని దానికీ కీచులాడుకుంటూనే ఉంటారు!

సర్లే, నాకెందుకొచ్చిందని ఊరుకున్నా. ఓ పది రోజులకి ఆ విత్తనం మొలకెత్తింది. మా కోడలు సంబరం ఇంతా అంతా కాదు. దాన్ని రోజూ ఎంతో అపురూపంగా చూసుకుంటూ కొంచెం ఎదగ్గానే దాన్ని గోడకి అంటివున్న పైపుకి కట్టి, ఆ పైపుని పట్టుకుని డాబామీదకి అల్లుకునేలా ఏర్పాటు చేసింది. మూడు నెలలు తిరిగేసరికి బాల్కనీ గోడ చుట్టూ అల్లుకుంది. బాల్కనీ చుట్టూ

ఉన్న 'గ్రిల్లు' నిండా అల్లుకుంటోంది. నేను బాల్కనీలో కూర్చుని వీధి లోకి చూడాలంటే ఇబ్బంది అవుతుందేమో, ఉన్న కాస్త కాలక్షేపం పోతుం దేమోనని గిల గిల లాడింది నా మనస్సు. ఊరుకోలేక కోడలితో ఓ సారి అని చూశాను. ఏమనుకుందో, ఆ తీగని కాస్త బిగించి పైకి లాగి, డాబా మీదకే ఎక్కువగా అల్లుకునేలా తాళ్ళూ, వెదురులూ వేసి కట్టింది.

మేడమీద ఒక్కటే గది ఉంది. తక్కినదంతా డాబాయే. ఆఫీసు నుంచి వచ్చాక అబ్బాయి అక్కడే కూర్చుని చదువుకుంటూ ఉంటాడు. ఆదివారాలు కూడా స్నేహితులతో అక్కడే గడుపుతూ ఉంటాడు. వాడో రోజున పెళ్లాన్ని పిలిచి కేకలేశాడు. నాకు సరిగ్గా వినిపించలేదు ఆ కీచులాట. నేను కలగ జేసుకోలేదు బాగుండదని.

ఆ తరవాత ఓనాడు మా కోడలు ఇల్లంతా శుభ్రంగా సర్ది, ముందు గదిలో బల్లమీద గాజు కూజాలో పువ్వుల కొమ్మలు గుచ్చుతోంది. పసుపు, ఎరుపు గులాబీలతో బాటు గంధపుచెక్క రంగులోఉన్న గులాబీ పూల కొమ్మల్ని కూడా గుచ్చింది. చూడటానికి తమాషాగా అనిపించి, ఇవేం పువ్వులా అని పట్టుకుచూశాను. ఎండిపోయి పెళపెళలాడు తున్నట్లు న్నాయి

'ఇవేం పువ్వులు, ఇలా ఉన్నాయి? ఆ తాజా గులాబీలతో పాటు వీటినెందుకుపెట్టావమ్మా?' అన్నాను

'వీటినే ఉడ్ రోజ్ అంటారండీ. ఇలా అమర్చడం 'వృద్ధాప్యం, యౌవనం' కలిపి చూపించడానికి. ఉడ్‌రోజ్ పువ్వులు వృద్ధాప్యానికీ, తాజా గులాబీలు యౌవనానికీ ప్రతీకలన్నమాట. ఇటువంటి అలంకరణని 'ఇకెబానా' అంటారు.'

'అత్తాకోడళ్లని పిలవరాదా !' అన్నా నవ్వుతూ. మా కోడలు కూడా నవ్వేసింది.

అప్పటి నుంచీ ఆ ఉడ్ రోజ్ పువ్వులు ఎప్పుడు పూస్తాయా అని బాల్కనీలో కూర్చుని ఆ తీగ కేసి చూస్తూ ఉండేదాన్ని, వీధిలో వచ్చే పోయే మనుషుల్ని చూడటానికి బదులు. ఆ తీగతో ఏదో అనుబంధం ఏర్పడినట్లు అనిపించింది.

తీగనిండా పసుపు పచ్చని బాకా పువ్వులు కళకళ్లాడుతూ కనిపిస్తున్నాయి. ఇంక ఉడ్‌రోజ్ పువ్వులు ఎప్పుడు పూయడం మొదలవుతాయా అని ఎదురు చూస్తున్నాను.

ఆ రోజు ఆదివారం. భోజనాల కింకా వేళ కాలేదు. పూజ ముగించుకుని, ఏం తోచక బాల్కనీలోకి వెళ్ళాను అక్కడ కూర్చుందామని.

'అదేమిట్రా, ఆ పూల తీగని అలా పీకేస్తున్నావ్?' అని అరిచాను.

అబ్బాయి గోపాలం నామాట వినిపించుకోలేదు. వరండా చుట్టూ అల్లుకుని డాబా గోడదాకా దట్టంగా అల్లుకున్న ఉడ్‌రోజ్ పూల తీగని అలా చీల్చి చెండాడుతూంటే నా మనస్సు గిలగిల్లాడింది. వాడు నా మాట వినిపించు కోవడం లేదని, వంటింటి వేపుకి వెళ్ళి కోడల్ని పిలిచి అడిగాను.

'అదేమిటమ్మా, వాడు ఆ ఉడ్‌రోజ్ తీగని అలా పీకి పోగు లెడుతున్నాడు, వచ్చి చూడు' అన్నాను.

'నా మాట వింటారేమిటి? ఆయనిష్టం తీగ పీకుతారు,' ఇల్లు పీకుతారు, పీక్కోనివ్వండి' అంది నిష్ఠూరంగా.

నా మనసు నిలవక, మళ్ళీ బాల్కనీలోకి వెళ్ళి చెప్పి చూశాను నిక్షేపంలా పువ్వులు పూస్తున్న తీగని పీకి పారెయ్యడం బాగుండదని. నా మీద ఖస్సుమని లేచాడు. నోరు మూసుకుని ఇవతలికి వచ్చేశాను.

చిన్నప్పుడు వాడికి నేనంటే ఎంత ఆపేక్ష ఉండేది! వాళ్ళ నాన్నగారు నన్ను చిన్న మాటన్నా సహించలేక పోయేవాడు. పొయ్యిలో కట్టెలు మండక, వంటింట్లో పొగతో నేను సతమత మవుతూంటే, 'అమ్మా, నేను పెద్దయాక నీకు వంటబాధ లేకుండా చేస్తానమ్మా' అనే వాడు. కళ్ళలో నీళ్ళు తిరిగేవి వాడిమాటలికి.

వాడు పెద్దయ్యాడు. నాకు వంట తప్పించి. నన్ను వంటింట్లో అడుగుపెట్టనివ్వదు కోడలు. అలా అని మురిసిపోనా! వాడు అమెరికాలో మూడేళ్ళు ఉండి వచ్చినప్పటినుంచీ కారాలు తినలేకపోతున్నాడు. నా వంటలో కారం బాగా పడుతుంది మరి. అలవాటయిన చెయ్యి-ఎంత తగ్గించుకుందామన్నా చాతకావడంలేదు. మా కోడల్లా చప్పిడివంటలు నా వల్ల కాదు. కారాలూ, పులుపులూ ఒంటికి మంచివికావని ఉపన్యాసాలిస్తారు ఇద్దరూకలిసి. నాకొచ్చిన పిండివంటలు కూడా ఇప్పుడు పాతకాలపువయి పోయాయి. ఆ బిరియానీలూ, కేకులూ నాకు రావు. కందిపచ్చడి కూడా మిక్సీలోనాయె! ఆ రుబ్బురోలూ నాలాగే మూలపడింది.

పెద్దవాళ్ళను బట్టే పిల్లలూనూ. మనవడికి మనవరాలికీ నాతో కబుర్లేం నచ్చుతాయి? అవేవో కామిక్కులట-అవి పుచ్చుకుని కూర్చుంటారిద్దరూ. ఇద్దరికీ భూతద్దాల్లాంటి కళ్ళజోళ్ళు అప్పుడే.

రాత్రి వాళ్ళు భోజనాలు చేస్తూండగా, వాళ్ళ భోజనాల బల్ల దగ్గర నించుని అడిగాను,

'అబ్బాయ్, గోపాలం, ఎందుకురా ఆ తీగని అలా పీకేశావ్?' అని.

'ఏ తీగ?' అన్నాడు. వాడప్పుడే మరచిపోయాడు. నా మనసులో ఇంకా అదే పీకుతోంది.

'అదేరా, ఆ ఉడ్‌రోజ్ తీగని' అన్నాను.

'ఓ, అదా! అదో న్యూసెన్స్ అయిపోయింది. వరండా గ్రిల్లంతా చుట్టుకుని హాల్లోకి వెలుతురు రాకుండా చేస్తోంది. మేడమీద గది కిటికీ అంతా అల్లుకుపోయింది. డాబా అంతా అల్లుకుపోయేట్టుగా ఉంది. ఇక ఇల్లంతా ఆక్రమించేలా ఉందని పీకి పారేశాను' అన్నాడు నిర్లక్ష్యంగా.

'తీగనిండా బోలెడు పువ్వులున్నాయిరా పచ్చగా' అన్నాను ప్రాణం ఉసూరుమనిపించి.

'పువ్వులమాటెలా ఉన్నా, తీగ కదిపితేచాలు పుట్టెడు దోమలు!' అన్నాడు ఆ దోమలన్నీ ఒక్కసారి కుట్టేసినట్లు మొహం పెట్టి.

నాకింకేం మాట్లాడాలో తోచలేదు.

పోయి నా మంచం మీదపడుకున్నాను. నిద్రరాదు. ఒకటే ఆలోచనలు. ఆ ఉడ్‌రోజ్ తీగే నా మనసు నిండా. ఎందుకోదాన్ని తలుచుకుంటే పుట్టెడు జాలేస్తోంది. రేపు నా పరిస్థితీ అంతే అవుతుందా అనిపించింది. ఆ ఊహకే నా ఒళ్ళు జలదరించింది.

మనిషికీ మనిషికీ మధ్య మమత ఆ తీగంత దట్టంగా పెరగకూడదేమో. అలా పెరిగితే, పిల్లలైతే పెకిలించి పారెయ్యగలరు. తల్లికి అల్లుకుపోవడమే తెలుసు.

(ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక,' 89)